

ఆకతాయిల ఆగడాలు..
మితిమీరినా పట్టించుకోరా?

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి. ముఖ్యంగా సంజయ్‌పూరికాలనీలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయి. రాత్రి వేళల్లో డ్యూటీ ముగించుకొని వచ్చే వారిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పలు కాలనీల్లో 24గంటలు బ్లాక్ అడ్డాలలో మద్యం అమ్మడం, గంజాయి కూడా విచ్చలవిడిగా దొరకడంతో ఆకతాయిల హద్దు అదుపు లేకుండా పోయింది.

17 సీసీ కెమెరాలు ధ్వంసం..

సంజయ్‌పూరికాలనీలో సుమారు 60 సీసీ కెమెరాలు ఉండేవి. అందులో 17 సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు గుంపులు గుంపులుగా రోడ్లపైనే తిష్ట వేసి వచ్చిపోయేవారిని ఇబ్బందులు పెడుతున్నారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని కాలనీవాసులు తెలిపారు. దీంతో రాత్రి 10గంటల దాటిందంటే అటుగా వెళ్లాంటేనే స్థానికులు భయపడుతున్నారు.

పెట్రోలింగ్ పెంచాలి..

ఈ విషయమై గత నెలలో సంక్షేమ సంఘం ప్రతినిధులు జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కానీ పోలీసులు ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో పెట్రోలింగ్ పెంచి ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో 1,976 మంది విద్యార్థుల చేరిక
- ఈ నెలాఖరు వరకు కార్యక్రమం పొడిగింపు
- ప్రైవేట్‌లో ఫీజులు.. పుస్తకాల మోతతో మారిన తల్లిదండ్రుల వైఖరి
- సర్కారు బడుల్లో ఇంగ్లిషు మీడియం సహా ఇతర వసతులూ కారణం



బడి బాట భళా..!

జిల్లాలో అనూహ్య స్పందన

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ నెల 3 నుంచి 9 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల (విద్యార్థుల) పేర్లు నమోదును చేపట్టిన విద్యాశాఖ 12 నుంచి 19 తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి స్పందన వస్తుండడంతో ఈ నెలాఖరు వరకు విద్యాశాఖ పొడిగించింది. జిల్లా విద్యాశాఖ చేపట్టిన బడి బాట కార్యక్రమంలో ఇప్పటి వరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 1,976 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇందులో ఒకటో తరగతిలో 1,194 విద్యార్థులు చేరగా, 2 నుంచి 10 వ తరగతిలో 782 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు క్రమంగా ఆదరణ..

ప్రభుత్వ పాఠశాలలకు క్రమంగా ఆదరణ పెరుగుతోంది. కరోనా కష్ట కాలం నుంచి మొదలు.. ప్రైవేట్, కార్పొరేట్‌ల్లో ఫీజులు.. పుస్తకాల మోతతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రుల ఆలోచనా విధానంలోనూ మార్పు వచ్చింది. దీనికితోడూ ప్రభుత్వం సర్కారు బడుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలతో విద్యార్థుల తల్లిదండ్రుల ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.

మండలాల వారీగా ఇలా...

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 1,976 మంది విద్యార్థులు చేరారు. ఇందులో మేడ్చల్ మండలంలో 140 మంది విద్యార్థులు, కూకట్‌పల్లిలో 538, బాలానగర్‌లో 297, అల్వాల్‌లో 129, మల్కాజిగిరిలో 152, మేడిపల్లిలో 123, కాప్రాలో 24, శామీర్‌పేటలో 140, కీసరలో 148, ఘట్‌కేసర్‌లో172, మూడుచింతలపల్లిలో 117 విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.

ప్రభుత్వ బడులపై ఆదరణ పెరిగిందిలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలకు తగ్గట్టుగా ప్రభుత్వం అన్నీ ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టింది. అలాగే మనఊరు–మన బడి–మన బస్తీ కార్యక్రమం కింద మొదటి విడతలో 176 ప్రభుత్వ బడుల్లో రూ.70 కోట్లతో మరమ్మతులు , మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు.

జిల్లాలో ఇప్పటివరకు 35 పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దారు.అలాగే, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో రూ.12.50 కోట్లతో 286 ప్రభుత్వ బడుల్లో మరమ్మతులు చేపడుతున్నారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతుండడంతో పాటు విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాల పంపిణీ , మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలను బడి బాట కార్యక్రమం ద్వారా జిల్లా విద్యాశాఖ ప్రచారం చేస్తోంది.

కరోనా నేర్పిన పాఠం

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కరోనా కష్ట కాలంలో 2021–22 విద్యా సంవత్సరంలో 515 ప్రభుత్వ పాఠశాలల్లో 9,718 మంది విద్యార్థులు చేరారు. ఇందులో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 3,408 మంది ఉన్నారు. అలాగే 2022–23లో జిల్లాలో కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో 793 మంది చేరగా, ఇందులో ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి వచ్చి చేరిన విద్యార్థులు 339 మంది ఉన్నారు.

పాఠశాలల్లో వసతులు మెరుగుపరిచేందుకు కృషి

నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. మంగళవారం నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అదనపు తరగతులు నిర్మించాలని, బోర్ వేయించాలని, బెంచీలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్ ఆయన దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. అనంతరం పీఎంశ్రీ నిధులతో చేపడుతున్న సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించిన డిప్యూటీ మేయర్ త్వరిత గతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ సుజాత, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



ప్రగతినగర్ శ్మశానవాటికను సందర్శించిన కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంఛార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం ప్రగతినగర్ శ్మశానవాటికలో బోరు పనులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ ఇతర సదుపాయాలను కల్పించాలని కోరారు. ఆయన వెంట కార్పొరేటర్ ఇంద్రజిత్‌రెడ్డి, నాయకులు అరవింద్ నాయుడు, తులసీదాస్, మధుసూదన్‌రెడ్డి, రఫత్, రవీందర్‌రావు, రాములు నాయక్, రమణ, గణేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు



ప్రశాంతి గోల్డెన్ హిల్స్‌లోని రోడ్డు పక్కన పడి ఉన్న పైపులైన్‌లు

నత్తనడకన అభివృద్ధి పనులు

నిజాంపేట్: అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నెలల తరబడి నత్తనడకన కొనసాగుతున్నాయి. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంతి గోల్డన్ హిల్స్ నుంచి నిజాంపేట్ ఆద్విత గార్డెన్స్ మీదుగా విజేత సూపర్ మార్కెట్ వరకు తాగునీటి పైపలైన్ పనులకు హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు శ్రీకారం చుట్టారు. మొత్తం కిలోమీటర్ పొడవున 400 దయా వెడల్పుతో చేపడుతున్న పైపులైన్ పనులు ఇటీవల ప్రశాంతి గోల్డెన్స్‌లోని సిద్ధిబ్లాక్ వద్ద అర్ధంతరంగా నిలిచిపోయాయి. వర్షాకాలం ప్రారంభమవుతున్న తరుణంలో పనులు చేపడితే స్థానికంగా రాకపోకలకు తీవ్ర ఆటంకం తలెత్తనుందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై 'సాక్షి'జలమండలి అధికారులను వివరణ కోరగా స్థానికంగా పనుల విషయమై ఫిర్యాదులు చేయడంతో కార్పొరేషన్ అధికారులు జేసీబీని సీజ్ చేశారన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు స్పందించారని త్వరలోనే పనులు చేపట్టి పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: గాజులరామారం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో మెట్‌కానిగూడకు చెందిన శ్రీశైలం యాదవ్ తమ్ముడు కిట్టు జ్ఞాపకార్థం మంగళవారం విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి ప్రభుత్వ పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవ్‌రెడ్డి, సంతోష్‌ముదిరాజ్, జగన్, సురేందర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు సమస్యను వివరిస్తున్న స్థానికులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి సమస్యలపై వినతులు అందజేశారు. దీనిపై స్పందించిన రాజు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి పైపులైన్ల పనులు పూర్తి కావస్తున్నాయని, ఎక్కడైనా సమస్యలుంటే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. అదే విధంగా పలువురు శుభకార్యాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



కొంపల్లి చౌరస్తాలో ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు

కుత్బుల్లాపూర్: రాంగ్ రూట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి కట్టడి చేసేందుకు మూడోరోజు మంగళవారం సైతం ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు నేతృత్వంలో ఎస్సైల ప్రశాంత్‌రెడ్డి, శ్యామ్‌లు సుచిత్ర సర్కిల్, పేట్‌బషీరాబాబాద్, కొంపల్లి – దూలపల్లి చౌరస్తా, బొల్లారం చౌరస్తాల్లో రాంగ్ రూట్‌లో, నెంబర్ ప్లేట్లు లేని, లైసెన్స్‌లు లేని ద్విచక్ర వాహనదారులను గుర్తించి వారికి జరిమానా విధించారు. మరోసారి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తామని సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.

చెత్త వేస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష



షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్

రంగారెడ్డినగర్: జనవాసాల మధ్య ఖాళీ ప్రదేశాల్లో చెత్త పారబోయకుండా అధికారులు కట్టడి చర్యలు చేపట్టారు. సూరారం డివిజన్ హెచ్ ఎంటీకాలనీ కమిటీ హాలు సమీపంలో షాపూర్‌నగర్ మార్కెట్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్థానికులు, దుకాణదారులు చెత్త పారబోస్తున్నారు. దీనిపై జీహెచ్‌ఎంసీ అధికారులు దృష్టి సారించి వద్ద చెత్తను తొలగించి హెచ్చరికలతో కూడిన బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా చెత్త పారబోయకుండా ముగ్గులు వేయించారు. ఇకపై చెత్త పారబోస్తే రూ.3వేల జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తామన్నారు. చెత్త సేకరణ ఆటోరిక్షా వాలాలకు ఇళ్ల వ్యర్థాలను అందజేయాలని సూచించారు.

జీడిమెట్ల జెడ్‌ఎం మాధవి బదిలీ



జీడిమెట్ల: జీడిమెట్ల జోనల్ మేనేజర్ బెల్లం కొండ మాధవి బదిలీ అయ్యారు. ఎనిమిదేళ్లుగా జీడిమెట్ల టీఎస్‌ఐఐసీలో జెడ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఆమె బదిలీల్లో భాగంగా టీఎస్‌ఐఐసీ హెడ్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో పటాన్‌చెరు జోనల్ మేనేజర్‌గా ఉన్న అనురాధ ఇక్కడకు బదిలీ అయ్యారు. కొత్తగా వచ్చిన అనురాధ బాధ్యతలు చేపట్టలేదు.

దాతృత్వం



వంశీరెడ్డికి చెక్కును అందజేస్తున్న బొబ్బా ప్రసాద్

జీడిమెట్ల: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవధర్మమని ఎస్ఆర్ నాయక్‌నగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు బొబ్బా ప్రసాద్ అన్నారు. కాలనీకి చెందిన కడిమి దుర్గాప్రసాద్ కుమార్తె శరణ్య అపురూపాకాలనీలోని టీవీఆర్ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. దుర్గాప్రసాద్ కొన్ని నెలల క్రితం అనారోగ్యం బారిన పడి మృతి చెందారు. కాగా వారి కుటుంబం శరణ్య ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉందని తెలుసుకున్న బొబ్బా ప్రసాద్ విషయాన్ని అమెరికాలో ఉన్న అతని అల్లుడు వాసిరెడ్డి గౌతంకు తెలియజేశారు. దీనికి స్పందించిన ఆయన చిన్నారి 9, 10వ తరగతికి చెందిన ఫీజు రూ.96వేలు ఉండగా పాఠశాల డైరెక్టర్ వంశీరెడ్డి 50శాతం రాయితీ ఇచ్చారు. మిగతా రూ.44వేలను వాసిరెడ్డి గౌతం చెల్లించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో గుబ్బల లక్ష్మీనారాయణ, పితాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత



వీధి కుక్కలను పట్టుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

దుండిగల్: వీధి కుక్కల నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వీధి కుక్కలను పట్టుకున్నారు. బ్లూ క్రాస్ సొసైటీ భాగస్వామ్యంతో 18 కుక్కలను పట్టుకున్నారు. కుక్కలకు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయడంతో పాటు యాంటి రేబిస్ టీకా వేయించి దూర ప్రాంతాల్లో వదిలేస్తామని సత్యనారాయణ తెలిపారు. ఆహారం లేకపోవడంతో కుక్కలు వింతగా ప్రవర్తిస్తున్నాయని, చిన్న పిల్లలు తిరగని ప్రాంతాల్లో కుక్కలకు ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో బ్లూక్రాస్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి సహకారం అందిస్తా



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను సన్మానిస్తున్న యూనియన్ నేతలు

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. డి.పోచంపల్లి సారెగూడెంలోని ఆల్కాలిక్ మెటల్స్ పరిశ్రమ ఎంప్లాయిస్ యూనియన్‌లో ఐఎన్‌టీయూసీ గెలుపొందిన విషయం తెలిసిందే. నూతన కమిటీ సభ్యులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... పరిశ్రమ అభివృద్ధిలో భాగస్వాములై ఉద్యోగుల సంక్షేమం కోసం నూతన కమిటీ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సలహాదారుడు బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, యూనియన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎం.రాముగౌడ్, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, యాదగిరి, కె.శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

బచ్‌పన్‌లో ఓరియంటేషన్ డే



ఓరింటేషన్ డేకు హాజరైన చిన్నారుల తల్లిదండ్రులు

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లేస్కూల్‌లో ప్రీప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఓరియంటేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వెంకటరమణ పిల్లల ఆరోగ్యం , పరిశుభ్రత, ఆహారపు అలవాట్ల తదితర విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి మాట్లాడుతూ.. చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తమ పాఠశాల ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాల సీజ్

నకిలీ వైద్యులపై ఎఫ్‌ఐఆర్ నమోదు



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్ శివ బాలాజీ , కొర్రెములలోని ఆర్‌ఆర్ ప్రథమ చికిత్స కేంద్రాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్.రఘునాథ్ స్వామి మంగళవారం సీజ్ చేశారు. అలాగే, సంబంధిత నకిలీ వైద్యులపై చర్యలకు ఆదేశించడంతో స్థానిక పోలీసులు వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ ఆదేశాలతో మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో నకిలీ వైద్యులు అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. అర్హతలు లేకపోయినప్పటికీ, పలువురు నకిలీ డాక్టర్ల అవతారమెత్తి, అల్లోపతి మందులు రాస్తూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు, టీఎస్‌ఎంసీ చట్టం ప్రకారం నకిలీ వైద్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో జిల్లా డిప్యూటీ వైద్యారోగ్య అధికారి డాక్టర్ నారాయణరావు, కీసర డివిజన్ డాక్టర్ శోభన, నారాపల్లి వైద్యాధికారి పాపాని శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు.. పట్టించుకునేదెవరూ?



దూలపల్లి 120 గజాల్లోని సాయిబాబా ఆలయ రోడ్డులో పారుతున్న మురుగు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లి ప్రధాన రోడ్డు నుంచి సాయిబాబా గుడి పక్కన నుంచి 120 గజాలకు వెళ్లే రోడ్డులో నిత్యం డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 120 గజాల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు సాయిబాబా గుడి వైపు వెళ్తుంది. డ్రైనేజీ పైపులైన్ సామర్థ్యం చిన్నదిగా ఉండడంతో నిత్యం ఉదయం, సాయంత్రం వేళలో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు రోడ్డుపైకి వస్తోంది. దీంతో ఆ రోడ్డు మురికి కాలువగా మారింది. రోడ్డుపై మురుగు నిలవడంతో స్థానికులు ఆ రోడ్డు గుండా రాకపోకలు మానేశారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి పైపులైన్ సామర్థ్యాన్ని పెంచి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిర్ణయం అభినందనీయం

తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ర్యాంకులతో నిమిత్తం లేకుండా చెల్లిస్తామని ప్రకటించడం అభినందనీయమని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం బీటెక్, ఇతర ప్రవేశల పరీక్షల్లో 10వేల లోపు ర్యాంక్ వచ్చిన వారికే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేదని, దీంతో ఎక్కువ ర్యాంకులు వచ్చిన బీసీ విద్యార్థులు ఫీజు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీని నిలబెట్టుకుని బీసీ విద్యార్థులకు న్యాయం చేస్తున్నారని మహేందర్ ప్రశంసించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 24వేల టీచర్ పోస్టులను భర్తీ చేసి నాణ్యమైన విద్యను అందించాలన్నారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కీసర ఆర్డీవో కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. రెవెన్యూ అధికారులతో పాటు ఆపరేటర్లను ధరణి దరఖాస్తులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మాడ్యుల్స్ సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులకు సంబంధించి అవసరమైన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలన్నారు. డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి వారిపై చట్టపరంగా క్రిమినల్ కేసులు పెట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

ఇంటర్ విద్యార్థులకు అందుబాటులో నిథమ్ కోర్సులు

ఫ్యాకల్టీ డాక్టర్ కిరణ్మయి,మిషెల్లీ జే ఫ్రాన్సిస్

రాయదుర్గం: ఇంటర్ పాసైన విద్యార్థులకు గచ్చిబౌలిలోని 'నిథమ్'లో పర్యాటక, ఆతిథ్య కోర్సులు అందుబాటులో ఉన్నాయని నిథమ్ ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ కిరణ్మయి, మిషెల్లీ జే ఫ్రాన్సిస్ మంగళవారం వెల్లడించారు. 30 ఎకరాల స్థలంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన క్యాంపస్ అందుబాటులో ఉందన్నారు. నాలుగు ఏళ్ల కాలపరిమితితో కూడిన బీబీఏ డిగ్రీ (టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ), మూడేళ్ళ కాలపరిమితితో కూడిన బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) వంటి కోర్సులు ఉన్నాయన్నారు. 40 శాతం మార్కులతో పాసైన వారు చేరవచ్చన్నారు. 100 శాతం ప్లేస్‌మెంట్‌లున్న జాతీయ విద్యా సంస్థగా నిథమ్ గుర్తింపు పొందిందని వారు పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి హోటళ్ళు, రెస్టారెంట్లు, ట్రావెల్, ఎయిర్‌పోర్టులు, ఈవెంట్స్, ఎంటర్‌టైన్ మెంట్ వంటి వాటిల్లో అవకాశాలు లభిస్తాయని వారు పేర్కొన్నారు.

30న సహజ యోగా మహోత్సవం

హఫీజ్‌పేట్: సహజ యోగా మహోత్సవంను ఈ నెల 30వ తేదీ చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు సహజ యోగా రాష్ట్ర కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం చందానగర్‌లో రాష్ట్ర కమిటీ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది యోగా సాధనతో ఆధ్మాతిక సంతృప్తిని పొందుతున్నారన్నారు. హైదరాబాద్ సహజ రియలైజేషన్ టూర్‌ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఈ నెల 26 నుంచి 30 వరకు నిర్వహిస్తారని సుమారు 500మంది ప్రతినిధులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్నారన్నారు.

27న నిధి ఆప్కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా ఈ నెల 2 న నిధి ఆప్కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. చందానగర్ మైహోం జువెల్ అపార్ట్‌మెంట్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని ఆల్ఫా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సదాశివపేట మండలం చందాపూర్‌లోని పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో భవిష్య నిధి సమస్యలు ఉన్న వారు పరిష్కరించుకోవాలని సూచించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029